క్లుప్తంగా

నేడు కంచిలి మండల సర్వసభ్య సమావేశం

కంచిలి: స్థానిక మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.తిరుమలరావు బుధవారం తెలిపారు. ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించబోయే సమావేశానికి అన్ని శాఖల అధికారులు, సభ్యులు హాజరు కావాలని సూచించారు.

ఎమ్మెల్సీ పరామర్శ



చత్రపతి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రామారావు తదితరులు

ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సుగ్గు చత్రపతి సోదరుడు హరిపతి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు బుధవారం చత్రపతి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎంపీపీ బోర పుష్ప, మాజీ ఎంపీపీ కారంగి మోహన్‌రావు, సర్పంచ్ ఆసి దాలయ్యరెడ్డి, పిట్ట ఆనంద్, దుక్క ఆనంద్, ఇసురు పరశురామ్ ఉన్నారు.

సోంపేట ఎక్సైజ్ సీఐగా జి.వి.రమణ



బాధ్యతలు చేపట్టిన జి.వి.రమణ

సోంపేట: సోంపేట ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జి.వి.రమణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో సోంపేట, ఇచ్ఛాపురం మొబైల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన ఈయన సోంపేట ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు పోలీసు, రెవెన్యూ యంత్రాంగంతో కలిసి కృషి చేస్తానన్నారు. సోంపేట సర్కిల్ పరిధిలోని సోంపేట, కంచిలి, మందస మండలాల్లో నాటుసారా రవాణా, అమ్మకాలు గురించి తెలిస్తే 9440902358 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చినవారి పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

వాహనాలకు రికార్డులు తప్పనిసరి

● సీఐ విజయ్‌కుమార్



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ విజయ్‌కుమార్

టెక్కలి రూరల్: ప్రతిఒక్కరు తమ వాహనాలకు సంబంధించిన రికార్డులు తప్పనిసరిగా ఉంచుకోవాలని టెక్కలి సీఐ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం అయన స్థానిక వైఎస్సార్ జంక్షన్ వద్ద కారు, ఆటో స్టాండ్ డ్రైవర్లకు అవగాహన కల్పించారు. వాహనానికి సంబంధించి రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలని డ్రైవర్లకు సూచించారు. వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు.

యోగాసన పోటీల్లో శ్రీకాంత్ ప్రతిభ



శ్రీకాంత్ మహంతిని అభినందిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

ఇచ్ఛాపురం: పశ్చిమబెంగాల్‌లో ఈనెల ఆరు నుంచి ఎనిమిదో తేదీ వరకు జరిగిన 35వ జాతీయస్థాయి సంప్రదాయ యోగాసనాల పోటీల్లో ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన శ్రీకాంత్ మహంతి సత్తాచాటాడు. ద్వితీయం స్థానంలో నిలిచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆలిండియా యోగా కల్చర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మా శారదా యోగా శిక్షాలయ, కంచరపడలో పోటీలను నిర్వహించారు. 22 నుంచి 30 సంవత్సరాల విభాగంలో శ్రీకాంత్‌మహంతి పోటీపడి ద్వితీయస్థానం కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ని కేంద్ర విమానయానశాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అభినందించారు.

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

● విద్యార్థులకు స్వాగతం పలకనున్న అసౌకర్యాలు
● కానరాని ముందస్తు చర్యలు





కంచిలిలోని ప్రాథమిక పాఠశాల

కంచిలి:

కొత్త విద్యా సంవత్సరంలోకి అసౌకర్యాల నడుమ విద్యార్థులు అడుగుపెట్టబోతున్నారు. వేసవి సెలవులు అనంతరం గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. అయితే గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన నాడు–నేడు పనులు తప్పితే ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కనీసం పాఠశాలలను పట్టించుకోలేదు. అలాగే వేసవి సెలవుల అనంతరం పాఠశాలలను తెరుచుకుంటున్నప్పటికీ అందుకు అనుకూలంగా ముందస్తు చర్యలను అధికారులు తీసుకోలేదు. పూర్తికాని ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ, అసంపూర్తి భవనాలు, పూర్తిగా రాని విద్యార్థుల కిట్లు తదితర సమస్యలు పిల్లలను ఆందోళనకు గురిచేసే అవకాశం ఉంది. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని వివిధ పాఠశాలల్లో నాడు–నేడు పథకం కింద మంజూరైన భవనాల్లో చాలా ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. ఇచ్ఛాపురం మండలంలో 70, కవిటిలో 102, కంచిలిలో 100, సోంపేటలో 79 పాఠశాలలు గురువారం నుంచి తెరచుకోనున్నాయి. వీటిలో చాలా పాఠశాలల్లో అసౌకర్యాలు తాండవిస్తున్నాయి. వీటిని ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి కూడా పూర్తి చేయలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపాలిటీలో పూర్తికాని 'నాడు–నేడు'పనులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని జంట పట్టణాల్లోని పాఠశాలల్లో గత ప్రభుత్వ హయంలో చేపట్టిన నాడు–నేడు పథకం పనులు తప్పితే కూటమి సర్కార్ హయాంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదు. దీంతో గురువారం నుంచి పాఠశాలలకు వెళ్లనున్న పిల్లలకు అసౌకర్యాలు స్వాగతం పలకనున్నాయి. గత వైఎస్సార్‌సీపీ సర్కార్ హయాంలో కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండున్నర కోట్ల రూపాయలతో 20 భవనాలు నిర్మించారు. అయితే ఎన్నికలు సమీపించడంతో రంగులు వేసే పనులు నిలిచిపోయాయి. ఎన్నికల తరువాత అధికారంలోకి కూటమి ప్రభుత్వం ఏడాదైన ఇప్పటివరకూ రంగులు వేసే పనులపై దృష్టిసారించలేదు. అలాగే గత సర్కార్ హయాంలో పలాస హైస్కూల్‌లో రూ. 1.90 కోట్లతో 15 తరగతి గదుల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. వీటికి కూడా ఎన్నికల కోడ్ ఆటంకంగా మారింది. ఆ తరువాత అధికారం చేపట్టిన కూటమి సర్కార్ పనులు పూర్తిపై దృష్టిసారించలేదు. ఒకటోవార్డు పరిధి మొగిలిపాడు, నాలుగో వార్డు అంబుసోలి, పదోవార్డు పెంటవీధిలోని యూపీ పాఠశాలలో నాలుగు కోట్ల రూపాయలతో పనులు ప్రారంభించినప్పటికీ.. ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయాయి. వీటిని కూటమి ప్రభుత్వం పూర్తి చేయలేదు. దీంతో గురువారం పాఠశాలలకు వెళ్లే పిల్లలకు అసౌకర్యాలు స్వాగతం పలకనున్నాయి.



కాశీబుగ్గ: రంగులకు నోచుకోని కాశీబుగ్గ హైస్కూల్ భవనాలు

'నాడు-నేడు' పనులు పూర్తి చేయలేదు



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 16 ప్రాథమిక ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో ఇంతవరకు 'నాడు–నేడు'పనులు పూర్తి చేయలేదు. కూటమి ప్రభుత్వం విద్యపై దృష్టిసారించలేదు. దీంతో గురువారం నుంచి స్కూళ్లకు వెళ్లే పిల్లలకు అసౌకర్యాలు స్వాగతం పలకున్నాయి. విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సుజాత పండా, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ

మూలకు చేరిన ఆర్వోప్లాంట్‌లు..

టెక్కలి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మొదలు కొని పుస్తకాలు, విద్యా కానుక కిట్లతోపాటు అసంపూర్తి భవనాలు తదితర సమస్యలు విద్యార్థులకు స్వాగతం పలకనున్నాయి. ప్రధానంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందజేసిన ఆర్వో ప్లాంట్లు సైతం మూలకు చేరుకున్నప్పటికీ వాటిని కనీసం బాగు చేయాలనే ఆలోచన కూటమి ప్రభుత్వానికి లేకుండా పోయింది. టెక్కలి నియోజకవర్గంలోని టెక్కలి, కోటబొమ్మాళి, నందిగాం, సంతబొమ్మాళి మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో నెలకున్న సమస్యల నడుమే పిల్లలకు తరగతి గదుల్లోకి అడుగుపెట్టనున్నారు.



టెక్కలి మెయిన్ స్కూల్‌లో మూలకు చేరిన ఆర్వో ప్లాంట్

మీడియాపై దాడులు నశించాలి



కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

టెక్కలి: మీడియాపై దాడులు నశించాలి, జర్నలిస్టులపై అక్రమ కేసులు ఖండించాలి అంటూ బుధవారం టెక్కలిలో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల 'సాక్షి'కార్యాలయాలపై దాడులు, సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టుల నేపథ్యంలో టెక్కలిలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కె.సుదర్శన్‌రావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జంక్షన్‌లో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాపై దాడులు నశించాలి, జర్నలిస్టుల పై అక్రమ కేసులు ఖండించాలి, జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఎస్.రాజశేఖర్, ఎల్.వి.రమణ, పి.పాపారావు, డి. భాస్కరరావు, డి.ఈశ్వరరావు, టి.ప్రసాద్‌రెడ్డి, డి. రంగబాబు, ఎం.కిరణ్, ప్రసాద్ శతపతి, తేజ పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం

టెక్కలి: టెక్కలి పట్టణానికి చెందిన నెల్లూరు శ్రీకాంత్, శృతి దంపతుల ఆరు నెలల చిన్నారి లవిత్రశ్రీ కాలేయ సంబంధిత సమస్యతో ఇబందిపడుతోంది. వైద్యానికి అభయం యువజన సేవా సంఘం సభ్యులు రూ.60 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. చిన్నారి కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకుని ఈ సాయాన్ని అందజేశారు. ఎవరైనా సాయం చేయాలనుకునేవారు 94945 87587, 94411 16108 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని వారు కోరారు. డి.శ్రీనివాస్, అందవరపు కిషోర్, ఎ.వీరభద్రం పాల్గొన్నారు.

అధికారుల తీరుకు నిరసనగా..
సర్వసభ్య సమావేశం బహిష్కరణ



నిరసన తెలియజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వసంతరెడ్డి, ఎంపీపీ రాజేశ్వరి తదితరులు

సంతబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశాన్ని పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు బహిష్కరించారు. ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రజాప్రతినిధులు అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులను అధికార పార్టీ ఒత్తిడితో అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని అన్నారు. మండల పరిషత్, గ్రామ పంచాయతీ నిధులతో అభివృద్ధి పనులు చేపడతామన్న సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ అభివృద్ధి పనులకు ఎస్టిమేట్స్ వేయటం లేదన్నారు. తహసీల్దార్, ఎంపీడీవో, ఇతర అధికారులు ఎవరూ ప్రజాప్రతినిధులకు సహకరించడం లేదని, అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా మారారని ధ్వజమెత్తారు. అలాగే ఎంపీటీసీ సభ్యులకు 18 నెలల నుంచి జీతాలు కూడా ఇవ్వడం లేదన్నారు. అందుకు నిరసన తెలియజేస్తూ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తెలియజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి, వైస్ ఎంపీపీ పొందల తులసమ్మ ఉన్నారు.

అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ దానయ్య

మందస: స్థానిక మండలాభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ డొక్కరి దానయ్య అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. అయితే వివిధ శాఖల మండల అధికారులు పూర్తి స్థాయిలో హాజరుకాలేదు. దీనిపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాలకు అధికారులే గైర్హాజరైతే ఎలా అని..ఇలాంటి సమావేశాలు ఎందుకని వైస్ ఎంపీపీ సీర ప్రసాద్ ప్రశ్నించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ఒక్కసారి కూడా మండల సమావేశాలకు హాజరు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని వివిధ గ్రామాల రోడ్లు శిథిలావస్థలో దారుణంగా ఉన్నాయని.. ప్రమాదాలు జరిగితే ఎవకు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఎంపీపీ డొక్కరి దానయ్య మాట్లాడుతూ.. సభ్యులకు కొన్ని నెలలుగా గౌరవ వేతనం రాకపోవడంపై విచారం వ్యక్తం చేశారు. తహసీల్దార్ మిస్కా శ్రీకాంత్ మాట్లాడుతూ.. నీటి పన్ను చెల్లించేలా ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో వై.వెంకటరమణ, మండల వ్యవసాయ అధికారి రుశేశ్వరరావు పాల్గొన్నారు.

'ఉపాధి'లేక ఇబ్బంది పడుతున్నాం!

● చిన్నకర్రివానిపాలెం వాసుల ఆవేదన



ఉపాధి పనుల్లేవని వాపోతున్న చిన్నకర్రివానిపాలెం గ్రామస్తులు

కవిటి: ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించకపోవడంతో ఇబ్బందిపడుతున్నామని చిన్నకర్రివానిపాలెం మత్స్యకార గ్రామానికి చెందిన వేతనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పలువురు ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డుదారులు బుధవారం విలేకరులతో మాట్లాడారు. వాస్తవానికి జిల్లాలో పలు మత్స్యకార గ్రామల్లో వేతనదారులకు వందరోజుల పని అంటూ చెబుతున్నారని..అయితే తమకు మాత్రం ఆనందం లేకుండా పోయిందని వాపోయారు. గ్రామంలోని పంటపొలాల్లో వరద నీరు బయటకు వెళ్లాలంటే గౌనామరిగెడ్డ బట్టిని ఉపాధిహామీ పథకంలో బాగుచేసేందుకు జనవరి నుంచి అవకాశం ఉన్నా సంబంధిత సిబ్బంది ఆ దిశగా ఆలోచించడం లేదన్నారు. తమ గ్రామంలో 447కు పైగా జాబ్‌కార్డుదారులు ఉన్నారన్నారు. వీరిలో 40 మందికి ఇటీవల పొరుగు గ్రామంలో పనులు చేసేందుకు ఎంపిక చేయగా తాము అంగీకరించలేదన్నారు. కొద్దిమందికి పనికల్పించి మిగిలిన వారిని విస్మరిస్తే తమలోతమకు అరమరికలు వస్తాయనే ఉద్దేశంతో తిరస్కరించామన్నారు. గ్రామానికి ఆనుకుని తీరంలోగానీ, గౌనామరి గెడ్డలోగానీ తక్షణమే పనులకు అవకాశం ఇచ్చి ఉపాధి కల్పించాలని గ్రామస్తులు కోరారు.

● వైభవంగా జగన్నాథస్వామికి దేవస్నానం

జగన్నాథస్వామికి జేష్టపౌర్ణమి వేడుకలలో భాగంగా దేవస్నాన పూజలు బుధవారం వైభవంగా జరిగాయి. జేష్ట మండపంపై మూలవిరాట్‌లను ఆవాహన చేశారు. ఈ నెల 27 నుంచి జూలై ఐదో తేదీ వరకు తొమ్మిది రోజుల రథాయాత్ర ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా దేవస్నానం కార్యక్రమాన్ని నిర్వహించారు. జగన్నాథస్వామి, బలబద్రుడు, సుభద్రలకు పంచామృతాలు, పసుపు, కుంకుమ, వివిధ రకాల జలాలు, పండ్లరసాలతో అభిషేక పూజలు చేయగా.. భక్తులు ఈ సుందర దృశ్యాన్ని చూసి మురిసిపోయారు. భక్తులకు ఇబ్బందుల్లేకుండా దేవదాయశాఖ అధికారులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

–సాక్షి నెట్‌వర్క్



ఇచ్ఛాపురం: జేష్టమండపంలో స్వామివారికి ప్రత్యేక పూజలు



కవిటి: జగన్నాథస్వామికి జేష్టాభిషేక పూజలు



టెక్కలిలో గోపాల జగన్నాథస్వామికి దేవస్నానం చేస్తున్న పండాలు



కాశీబుగ్గ: రైల్వేస్టేషన్ సమీపంలోని ఆలయం వద్ద పూజలందుకుంటున్న ఉత్సవమూర్తులు



మందసలో జగన్నాథుని దివ్యస్నానం



మందస: సాభకోటలో జగన్నాథునికి భక్తుల పూజలు

అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు, సహాయకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీవో పి.నాగరాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి కార్జీవీధి అంగన్‌వాడీ సహాయకురాలు (బీసీ–డి), గొల్లవీధి అంగన్‌వాడీ సహాయకురాలు(బీసీ–బీ), పురుషోత్తపురం–4 కేంద్రం సహాయకురాలు (ఎస్సీ), పురుషోత్తపురం –1లో కార్యకర్త (బీసీ–ఏ), ఇచ్ఛాపురం మండలం కె.శాసనం కేంద్రంలో సహాయకురాలు (ఎస్సీ), పెద్దలక్ష్మీపురంలో కార్యకర్త (బీసీ–ఏ), తేలుకుంచి అంగన్‌వాడీ సహాయకురాలు (ఎస్సీ), కవిటి మండలంలోని ఒంటూరు అంగన్‌వాడీ సహాయకురాలు (బీసీ–ఈ), కమలాయిపుట్టుగలో కార్యకర్త (ఎస్సీ), రాజపురం –2లో సహాయకురాలు(బీసీ–బీ), జగతి–2 కేంద్రంలో సహాయకురాలు (ఎస్సీ) పోస్టులకు అర్హులైన వివాహిత మహిళలు ఈ నెల 20వ తేదీ సాయంత్రంలోగా ఐసీడీఎస్ కేంద్రాలో‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

నీరుపారే దారేదీ?



లొళ్లవీధిలో ఇంటి ఎదుట నిలిచిన వర్షపునీరు

● బిగొనవపుట్టుగలో క్షీణిస్తున్న పారిశుద్ధ్యం

కవిటి: బిగొనపపుట్టుగ పంచాయతీ కేంద్రంలో పారిశుద్ధ్యం క్షీణిస్తుందనే ఆందోళన స్థానికుల నుంచి వ్యక్తమవుతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు వెళ్లేందుకు అనుకూలమైన పరిస్థితుల్లేక ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతోపాటు వీధుల్లో రోజుల తరబడి నిలిచిపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే వ్యాధులు ముసిరే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధుల్లో వర్షపునీటి ప్రవాహానికి రోడ్డులే అడ్డంకిగా మారాయి. కొంతమంది రోడ్లపైనే రాళ్లకుప్పలు వేసి నెలలతరబడి అలానే వదిలేస్తున్నారు. ఏమి ఎందుకు ఇలా అని అడిగితే గొడవలకు దారితీస్తున్నాయి. వీధుల్లో పరిస్థితిని చక్కదిద్దాల్సిన పంచాయతీ సిబ్బంది కుర్చీలు వదలడం లేదు. దీంతో గ్రామంలో మురుగు, వర్షం నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతుండడంతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఇప్పటికైన పంచాయతీ సిబ్బంది స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



వరదనీరు వెళ్లేమార్గంలో రాళ్లకుప్ప అడ్డంగా వేసిన దృశ్యం

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



టెక్కలి మండలం చల్లపేట గ్రామంలోని అభయ ఆంజనేయ స్వామి దేవస్థానం పదో వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ జి.మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. సాయంత్రం నిర్వహించిన స్వామివారి ఊరేగింపులో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

–టెక్కలి రూరల్

మొక్కలు నాటివేత



ప్రకృతిని కాపాడటానికి ప్రతిఒక్కరు విధిగా మొక్కలు నాటాలని వక్తలు అన్నారు. కొత్తపల్లి కొత్తపల్లి గ్రామంలోని సచివాలయం, శ్మశాన వాటికలో మర్రి, బాదం, కాగు మొక్కలను బుధవారం నాటారు. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఆధ్వర్యంలో వీటిని నాటి సంరక్షణ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సేనాపతి మురళి, పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.గణేశ్వరరావు, గవ్వ భీమారావు, గ్రామపెద్దలు హరిబందు, జగన్నాయుకులు, యువకులు గోపి, హరిష్, హేమరాజు, వినయ్ పాల్గొన్నారు.

–మందస

వైభవంగా పౌర్ణమి వేడుకలు



కంచిలి మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న జగన్నాథస్వామి ఆలయాల్లో జ్యేష్ఠపౌర్ణమి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. కంచిలి జగన్నాథ స్వామి ఆలయంలో ట్రస్టీ జానకీరామ్‌దాస్ ఆధ్వర్యంలో చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దీన్ని తిలకించారు. వచ్చిన భక్తులందరికి అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

–కంచిలి

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
టెక్కలి 7093164422
పలాస / ఇచ్ఛాపురం 9010178979
Office mail : sklmadvt@gmail.com